ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
శనివారం 8 నవంబరు 2025





గాయత్రి షుగర్స్‌లో క్రషింగ్ పూజలు నిర్వహిస్తున్న వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు

గాయత్రి షుగర్స్‌లో క్రషింగ్ పూజలు

సదాశివనగర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్‌లో వైస్ ప్రసిడెంట్ వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో క్రషింగ్ పూజ లు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రసిడెంట్ వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ సిబ్బంది, కార్మికులు ఈ సీజన్ క్రషింగ్ విజయవంతం అయ్యే విధంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. క్రషింగ్ పూర్తి అయ్యే వరకు ఎలాంటి ఆటంకాలు జరగకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ లక్ష్యం నెరవేరే విధంగా కృషి చేయాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ చెరుకు తరలించడంలో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు, ఈ కార్యక్రమానికి హాజరైనా సీడీసీ ఛైర్మన్ ఇర్షాద్ మాట్లాడుతూ చెరుకు అభివృద్ధికి రైతులు చెరుకు విస్తీర్ణం అధికంగా సాగు చేసేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. చెరుకు విస్తీర్ణం సాగు కోసం గాయత్రి షుగర్స్ యాజమాన్యం రైతులకు చెరుకు విత్తనం సరఫరా చేస్తామని ప్రకటించడం అభినందనీయమన్నారు. ప్రతీ రైతు సబ్సిడీని ఉపయోగించుకుని చెరుకు విస్తీర్ణం పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ మేనేజర్ మాల కొండయ్య, పీవో పసుపు పుల్లారెడ్డి, ఇంజనీరింగ్ జనరల్ మేనేజర్ వీరరా జు కుటుంబ రావు, డిస్టిలరీ జీఎం సుబ్బారావు, మేనేజర్ రెడ్డయ్య, చెరుకు రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోపాలరావు, రూపేందర్‌రెడ్డి, కార్మిక సంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

రైతులు అధైర్య పడొద్దు

- ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

గాంధారి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అకాలవర్షాల కారణంగా ధాన్యం తడిసిన రైతులు అధైర్య పడొద్దని అన్నారు. ప్రతీ రైతుకు సంబంధించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటానని అన్నారు. ఇప్పటికే వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో మాట్లాడినట్లు పేర్కొన్నారు. ప్రతీ రైతుకు సంబంధించిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు పడేవిధంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ పరమేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సింగసాని శ్రీనివాస్, ముకుందరావు, మాజీ ఎంపీటీసీ రాములు, గడ శంకర్, సంగని బాబా, బాల్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

విలువిద్య పోటీలు ప్రారంభం

దోమకొండ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా విలువిద్య పోటీ లను శుక్రవారం ఆర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తిరుమల్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నాగరాజురెడ్డి ప్రారంభించారు. రాష్ట్రస్థాయి విలువిద్య పోటీల్లో రికర్వు రౌండ్‌లో ఇందు సిల్వర్ మెడల్, వర్షిణి బ్రాంజ్‌మెడల్ సాధించి జాతీయస్థాయికి ఎంపిక కావడంతో వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోచ్ ప్రతాప్ దాస్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, నాయకులు శంకర్‌రెడ్డి, భూపాల్ రెడ్డి, రవి, రాములు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



పత్తి రైతుకు.. నిబంధనల కత్తి!

- ఎకరాకు ఏడు క్వింటాళ్లే కొంటామని సీసీఐ ఆంక్షలు
- కాపస్ కిసాన్ యాప్ లోనూ అలాగే స్లాట్ బుకింగ్
- తేమ నిబంధన మరో అడ్డంకి
- ప్రైవేటులో విక్రయిస్తే తేమ శాతం పేరుతో దోపిడీ
- గతంలో ఎకరాకు 12 క్వింటాళ్ల వరకు కొనుగోలు
- జిల్లాలో 31 వేల ఎకరాల్లో పత్తి సాగు.. 28 వేల మెట్రిక్ టన్నుల్లో దిగుబడి

కామారెడ్డి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : పత్తి కొనుగోళ్లపై సీసీఐ రోజుకో నిబంధనలతో రైతులను ఇబ్బందుల పాలు చేస్తోంది. ఇప్పటి వరకు కాపాస్ కిసాన్ యాప్‌లో నమోదైన పంటలను మాత్రమే కొంటామని నిబంధన విధించగా... తాజాగా ఎకరాకు 7 క్వింటాళ్ల పత్తి మాత్రమే కొంటామని మరో నిబంధన విధించింది. ఇప్పటి వరకు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో ఎకరానికి 12 క్వింటాళ్ల వరకు పత్తిని అమ్ముకునే వెసులుబాటు ఉండగా ప్రస్తుతం 5 క్వింటాళ్లు తగ్గించింది. తేమ, నాణ్యత పేరిట పెట్టే కొర్రీలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు నూతన నిబంధన శాపంగా మారింది. ఇప్పటికే భారీ వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన పత్తి రైతులు సీసీఐ నిబంధనలు మరింత ఇబ్బందులను గురి చేస్తోంది. సీసీఐ నిబంధనలతో ప్రైవేటు, దళారులకు అమ్ముకుంటే నాణ్యత పేరిట తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 28 వేల మెట్రిక్ టన్నుల్లో దిగుబలు

ఈ వానాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 31 వేల ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేశారు. మద్నూర్, జుక్కల్, పెద్దకొడప్గల్, బిచ్కుంద, పిట్లం, గాంధారి, సదాశివ్‌నగర్, తాడ్వాయి, రాజంపేట తదితర ప్రాంతాల్లో రైతులు వేల ఎకరాల్లోనే పంట సాగు చేశారు. ఇప్పటికే పంట చేతికి రావడం పత్తితీత కార్యక్రమం రైతులు చేపడుతున్నారు. అయితే ఈ సీజన్లో భారీ వర్షాలు, వరదల కారణంగా పత్తి దిగుబల్లపై తీవ్ర ప్రభావం పడింది. ఎకరానా 2 నుంచి 3 క్వింటాళ్ల దిగుబడులు తగ్గాయని రైతులు చెబుతున్నారు. ఈ లెక్కన జిల్లాలోని 31 వేల ఎకరాల్లో పత్తి సాగు కాగా సుమారు 28వేల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడులు వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది.

ఏడు కేంద్రాల్లోంచి ఒక్క దాంట్లోనే కొనుగోలు

జిల్లాలో పత్తి పంట చేతికి వచ్చింది రైతులు పత్తితీత చేపడుతున్నారు. ఇప్పటికే కొందరు రైతులు పత్తి దిగుబడులను అమ్ముకునేందుకు కేంద్రాలకు తరలిస్తున్నారు. దీంతో అధికార యంత్రాంగం ఇటీవల పత్తి కొనుగోళ్ల కోసం 7 కొనుగోలు కేంద్రాలను సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులోంచి 4 కేంద్రాలకు మాత్రమే అనుమతి ఇచ్చారు. ఇందులోనూ ఒకే ఒక కేంద్రంలో ప్రస్తుతం కొనుగోలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు సుమారు 500 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసినట్లు కేంద్ర నిర్వాహకులు చెబుతున్నారు. జిల్లాలో 7 పత్తి జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. ఈ మిల్లుల్లోనే సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తున్నారు. జిల్లా నుంచి కాకుండా పక్క జిల్లాలైన నారాయణఖేడ్, జహీరాబాద్‌ల నుంచి మద్నూర్‌కి వచ్చి సీసీఐ కేంద్రాల్లో రైతులు పత్తిని విక్రయిస్తుంటారు. కేంద్ర ప్రభుత్వం పత్తి క్వింటాలుకు రూ.8,110 మద్దతు ధరను ప్రకటించింది.

ఐదు క్వింటాళ్ల కోత

చాలా కాలంగా రైతులు పండించిన పత్తి పంటకు గిట్టుబాటు లభిస్తుందని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తుంటారు. ప్రతీయేటా సీసీఐ ఎకరానా 12 క్వింటాళ్ల వరకు రైతుల నుంచి కొనుగోలు చేస్తూ వస్తోంది. ఇప్పుడు అలా కాకుండా ఒక ఎకరానికి 5 క్వింటాళ్ల చొప్పున కోత విధించి కేవలం 7 క్వింటాలు మాత్రమే కొనుగోలు చేసేలా నిబంధనను విధించింది. స్లాట్ బుకింగ్ విధానంలో సీసీఐ పత్తిని కొనుగోలు చేస్తుండగా మొదట్లో 12 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేసి స్లాట్ బుకింగ్ అయింది. ప్రస్తుతం 7 క్వింటాళ్ల కొనుగోలుకు మాత్రమే అనుమతి ఇస్తూ స్లాట్ బుకింగ్ జరిగేలా సాఫ్ట్‌వేర్ అప్డేట్ చేశారు. దీంతో పత్తి పంట సాగు చేసిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

తేమ శాతం పేరుతో దోపిడీ

జిల్లాలో అధిక వర్షాలు కురవడం, ఇప్పటికీ అడపాదడపా కురుస్తూనే ఉండడంతో పత్తిలో తేమ శాతం అధికంగా ఉంటుంది. ఇదే విషయమై ప్రభుత్వం, అధికారులు సైతం తేమ శాతం ఉన్నప్పటికీ సీసీఐ అధికారులు కొనుగోలు చేయాలని ఆదేశాలిచ్చినా అమలు కావడం లేదు. పత్తి 8 నుంచి 12 తేమ శాతం ఉంటేనే కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర రూ.8,810 లభిస్తోంది. లేదంటే ప్రతీ ఒక శాతానికి కిలోన్నర చొప్పున కోత విధించి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో రైతులకు మద్దతు ధర దొరకకపోగా, అధిక వర్షాల కారణంగా తేమ శాతం పెరిగి రైతులు నష్టపోతున్నారు. సీసీఐ విధించిన నిబంధనలను ఎత్తివేయడమే కాకుండా తేమ శాతం పేరుతో చేస్తున్న కోతలను నిలిపివేయాలని రైతులు కోరుతున్నారు.



మంజీరాలోకి నీటిని విడుదల చేస్తున్న అధికారులు

సాగర్ రెండు గేట్ల ద్వారా నీటి విడుదల

నిజాంసాగర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ప్రాజెక్టులోకి మంజీరా నది వెంట భారీ వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో నీటి పారుదల శాఖ అధికారులు శుక్రవారం ప్రాజెక్టు వీఆర్ నెంబర్ 5లోని రెండు గేట్లను ఎత్తి దిగువ మంజీరాకు 9,750 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 75 రోజులుగా నిజాంసాగర్ ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వస్తూనే ఉన్నప్పటికీ అధికారులు క్రమేపి వరద గేట్లు ఎత్తి మంజీరా నదిలోకి వదులుతునే ఉన్నారు. ప్రస్తుతం నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1405 అడుగుల సామర్థ్యం కలిగి ఉంది.



ఎస్పీ కార్యాలయంలో వందేమాతర జాతీయ గీతాలాపన చేస్తున్న పోలీసులు

ఘనంగా 150వ వందేమాతరం వార్షికోత్సవం

కామారెడ్డి టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వందేమాతరం జాతీయ గీతం 150వ వార్షికోత్సవ వేడుకలను జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో, ఎస్పీ కార్యాలయంలో, సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో, తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. వందేమాతర జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వందేమాతరం గీతం భారతీయుల హృదయాల్లో దేశభక్తిని రగిలించే ఉద్యమ నినాదమని ఈ గీతం స్వాతంత్ర్య పోరాటానికి ప్రేరణగా నిలిచిందని తెలిపారు. భారత మాత పట్ల భక్తి, త్యాగం, దేశాభిమానానికి ప్రతీక అని అన్నారు. ఈ వేడుకలు ప్రతీ భారతీయుడిలో దేశభక్తి, ఐక్యత, జాతీయ గౌరవాన్ని మరింత బలపరుస్తాయని తెలిపారు. జాతీయ గీతం పట్ల గౌరవ భావాన్ని పెంపొందించడంలో, దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రాజేష్‌చంద్ర, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుమోహన్, డిప్యూటీ కలెక్టర్ రవితేజ పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో.. భార్య గొంతు కోసిన భర్త



గాయపడిన రామవ్వ

నాగిరెడ్డిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల కారణంగా భార్యాభర్తల మధ్య గొడవ జరిగి మండలంలోని చీనూర్ గ్రామానికి చెందిన తలారి నారాయణ శుక్రవారం తన భార్య తలారి రామవ్వను కత్తితో గొంతు కోశాడని, దీంతో ఆమె తీవ్రంగా గాయపడినట్లు స్థానిక ఎస్సై భార్గవ్‌గౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. చీనూర్ గ్రామానికి చెందిన తలారి నారాయణ, తలారి రామవ్వలు భార్యాభర్తలు, కాగా వీరు కుటుంబ కలహాలతో గొడవ పడి ఒక సంవత్సరంగా వీరిద్దరు విడిపోయి విడి విడిగా జీవిస్తున్నారు. కాగా రామవ్వ మంగళసూత్రంను తన భర్త నారాయణ అమ్ముకున్నాడని, ఆరు నెలల క్రితం పోలీస్ స్టేషన్‌ను సంప్రదించగా పోలీసులు సమస్యను పరిష్కరిస్తామని తెలపడంతో అప్పట్లో గొడవ సద్దుమణిగింది. తిరిగి శుక్రవారం రామవ్వ తన తల్లి లచ్చవ్వతో కలిసి పోలీస్ స్టేషన్‌కు వచ్చి తన మంగళసూత్రంతో పాటు తన భర్త అరవై వేల రూపాయలు తీసుకున్నాడని తనకు ఇప్పించగలరని పోలీసులను కోరింది. దీంతో పోలీసులు భర్త నారాయణతో మాట్లాడి రామవ్వ మంగళసూత్రంతో పాటు డబ్బులు ఇప్పిస్తామని ఇరువురికి నచ్చచెప్పడంతో గొడవ సద్దుమణిగింది. ఇరువురు కలిసి మండల కేంద్ర ంలోని గోపాల్‌పేట్ కల్లు దుకాణానికి వెళ్లి కల్లు తాగి తిరిగి వస్తూ పోలీస్ స్టేషన్‌కు ఎందుకు వెళ్లావని భార్యను నారాయణ అడిగి కోపంతో భార్య రామవ్వపై చీనూర్ రోడ్డుపైన కత్తితో దాడి చేసి గొంతు కోశాడని ఎస్సై తెలిపారు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని తీవ్రంగా గాయపడిన రామవ్వను చికిత్స నిమిత్తం 108 అంబులెన్సులో ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దివ్యాంగుల సాధికారత పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ సాధికారిత రాష్ట్ర పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని డీడబ్ల్యువో ప్రమీల శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యక్తిగత సంస్థాగత క్యాటగిరి కింద దివ్యాంగుల సాధికారత కోసం సేవలందిస్తున్న అర్హులైన వ్యక్తులు లేదా సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. వ్యక్తిగత కేటగిరీలో దివ్యాంగుల సాధికారిత కోసం పని చేస్తున్న అత్యుత్తమ వ్యక్తి, రోల్‌మోడల్, దివ్యాంగుల అత్యుత్తమ సృజనాత్మకత కలిగిన బాలుడు/బాలిక, అత్యుత్తమ పునరావస్తు నిపుణులు/సిబ్బంది వైకల్యరంగంలో పని చేస్తున్న వారు, సంస్థాగత వర్గంలో దివ్యాంగుల సాధికారిత కోసం పని చేస్తున్న అత్యంత అత్యుత్తమ సంస్థ, దివ్యాంగుల కోసం పనిచేసే ప్లేస్మెంట్ ఏజెన్సీలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కేటగిరీల వారీగా దరఖాస్తు ఫారం, వెబ్ మార్గదర్శకాల డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.డబ్ల్యుడీఎస్‌సీ, తెలంగాణ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో సందర్శించాలని సూచించారు. దరఖాస్తుదారుడు పూర్తిచేసిన దరఖాస్తు ఫారంతో పాటు సంబంధిత ధ్రువపత్రాలు జతపరిచి జిల్లా సంక్షేమాధికారి కార్యాలయం రూమ్ నెంబర్ 31లో ఈనెల 12న సాయంత్రం 5 గంటలలోపు హార్డ్ కాపీని అందించాలని తెలిపారు.

ఉపాధి కోసం వచ్చి.. ఉత్పత్తికి తోడై!



- వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన బిహారీలు
- శ్రమజీవులకు ఉపాధి అవకాశాలు
- అన్ని రంగాల్లో ఇరత రాష్ట్రాల శ్రమజీవులు

ఎల్లారెడ్డి రూరల్, నవంబరు 7: స్థానికంగా పొలం పనుల్లో బిహారీ కూలీలు పని చేస్తూ ఉపాధి పొందుతున్నారు. జిల్లాలో వరి కొనుగోళ్లు ఊపందుకున్న క్రమంలో ఎల్లారెడ్డి మండల పరిధిలోని శివనగర్, బ్రాహ్మణపల్లి, జంగమయ్యపల్లి, మత్తమాల, రుద్రారం, భిక్కనూర్, మాసన్‌పల్లి, కళ్యాణి, తిమ్మారెడ్డి, అన్నాసాగర్, వెల్లుట్ల, వెంకటాపూర్ తదితర గ్రామాల్లో బిహారీలు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కూలీలుగా పని చేస్తున్నారు. ఖరీఫ్, రబీ సీజన్‌లో బిహారీ కూలీలే కనిపిస్తున్నారు. పంటలు చేతికొచ్చే సమయంలో వీరు అతిథుల వలె చేరుకుంటున్నారు. సుమారు 45 నుంచి 60 రోజుల పాటు సాగే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రాత్రింబవళ్లు కష్టపడి శ్రమను ధారపోసి కొంత రొక్కం సంపాదించుకుంటున్నారు.

అన్ని రంగాల్లో పొరుగు సేవలు

ఒక్క కూలీలకే కాకుండా అన్ని రంగాల్లో ఇతర రాష్ట్రాల శ్రమజీవులకు నిలయంగా మారింది. రాజస్థానీయులు దాబా హోటళ్లు, స్వీట్ షాపులు, గుజరాతీలు దుస్తుల దుకాణాలు, వ్యవసాయ పనిముట్ల పరికరాలు, ఫ్యాక్టరీలు, కంపెనీలలో శ్రామికులుగా, ఆంధ్రులు నిర్మాణరం మేస్త్రీలుగా ఇలా అనేక రాష్ట్రాల వారికి తెలంగాణ ఆశ్రయం కల్పిస్తోంది.



భిక్కనూరు టోల్‌గేట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

భిక్కనూరు టోల్‌గేట్ వద్ద వాహనాల తనిఖీ

- 27 డ్రంకెన్‌డ్రైవ్ కేసుల నమోదు
- నిబంధనలు పాటించని వాహనాల సీజ్

భిక్కనూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని 44వ జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా వద్ద గురువారం అర్ధరాత్రి నుంచి భిక్కనూరు, దోమకొండ, బీబీపేట పోలీసు సిబ్బంది భిక్కనూరు సీఐ సంపత్ నేతృత్వంలో వాహనాల విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డుకు ఇరువైపుల ప్రతీ వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. డ్రైవర్లకు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్ష చేశారు. వాహనాల ధ్రువీకరణ పత్రాలను, లైసెన్స్, తదితర పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు భిక్కనూరు టోల్‌గేట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. డ్రంకెన్‌డ్రైవ్‌లో 27 కేసులు నమోదు కాగా, ధ్రువీకరణ పత్రాలు, తదితర కారణాలతో ఒక ట్రావెల్ బస్సు, రెండు డీసీఎం వ్యాన్లు, పది కార్లు, ద్విచక్రవాహనాలపై కేసులు నమోదు చేసి సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రతిరోజూ తనిఖీ చేపట్టడం జరుగుతుందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసుశాఖ కృషి చేస్తుందన్నారు. వాహనదారులు నిబంధనలు పాటించాలని, మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని అన్నారు. వాహనదారులు తప్పకుండా ధ్రువీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు, దోమకొండ, బీబీపేట, భిక్కనూరు పోలీసులు పాల్గొన్నారు.


మలావత్ పూర్ణకు పితృ వియోగం

ఇందూర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అత్యంత చిన్న వయస్సులో ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన నిజామాబాద్ జిల్లాకు చెందిన మలావత్ పూర్ణకు పితృవియోగం కలిగింది. ఆమె తండ్రి దేవీదాస్ (50) అనారోగ్యంతో శుక్రవారం కన్నుమూశారు. కొంతకాలంగా కామారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో కోమాలో ఉన్న ఆయన శుక్రవారం ఉదయం కన్నుమూశారు. అంత్యక్రియలు సాయంత్రం ఆయన స్వస్థలమైన నిజామాబాద్ జిల్లాలోని సిరికొండ మండలం పాకాలలో నిర్వహించారు.



తండ్రితో మలావత్ పూర్ణ(ఫైల్)

ఎంపీడీవోపై.. ఫిర్యాదు



జిల్లా పరిషత్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న నాగిరెడ్డిపేట ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది

నాగిరెడ్డిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపేట ఎంపీడీవో లలిత కుమారిపై కార్యాలయ సిబ్బంది శుక్రవారం కామారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ ప్రకాష్, జూనియర్ అసిస్టెంట్ అరుణ్, టైపిస్టు విఠల్‌తో పాటు అటెండర్లు సత్తెమ్మ, వెంకటేశ్వర్‌లు శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయానికి వెళ్లి ఎంపీడీవోపై ఫిర్యాదు చేశారు. కార్యాలయ సిబ్బందిపైన ఎంపీడీవో లలిత కుమారి దురుసుగా ప్రవర్తిస్తూ ఉద్దేశ్యపూర్వకంగా మాట్లాడుతున్నారని ప్రతీ విషయంలో చికాకు పడుతున్నారని వారు పేర్కొన్నారు. కార్యాలయంలో తాము విధులు నిర్వహించాలంటే భయభ్రాంతులకు, మనస్థాపానికి గురవుతున్నామని వారు పేర్కొన్నారు. ఇక్కడ విధులు నిర్వహించలేకపోతున్నామని, తమకు న్యాయం చేయాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో సీఈవో అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ సూపరింటెండెంట్ యుగంధర్‌కు ఫిర్యాదు చేసినట్టు సిబ్బంది తెలిపారు. ఈ విషయమై ఎంపీడీవో లలిత కుమారి ని స్థానిక విలేకరులు వివరణ కోరగా కార్యాలయంలో సిబ్బంది విధుల నిర్వహణలో సమయపాలన పాటించగా పోగా , క్రమశిక్షణ గాని, విధి విధానాలు పాటించడం లేదన్నారు. తన లాగిన్‌ను తమను అడగకుండానే వాడుతున్నారని, సిబ్బందిని సక్రమంగా పని చేయాలని చెబుతున్నానని ఆమె తెలిపారు.

క్రైం సమాచారం



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాస్

గంజాయి పట్టివేత.. ముగ్గురికి రిమాండ్

బోధన్,నవంబరు7(ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ఆటో, ముగ్గురు వ్యక్తులను పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు బోధన్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. శుక్రవారం ఉదయం పట్టణ శివారులోని మర్రి మైసమ్మ ఆలయంలో పక్కా సమాచారం మేరకు ఆటోలో వస్తున్న ముగ్గురిని తనిఖీ చేయగా.. గంజాయి తరలిస్తున్నట్లు తెలిసింది. దీంతో పట్టణ ఎస్‌ఐ మనోజ్ పోలీస్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో బిలోలి నుంచి బోధన్ వస్తున్న ఆటోలో మహారాష్ట్రలోని బిలోలికి చెందిన గోనేకర్ గణేష్ అలియాస్ కాశీనాథ్, బోధన్ పట్టణం బ్రాహ్మణపల్లికి చెందిన గాడే శేఖర్, నిజామాబాద్‌కు చెందిన షేక్ అబ్దుల్ కైసర్ వెళ్తున్న ఆటోను తనిఖీ చేయగా.. ఆటోలో ఒక ప్లాస్టిక్ లభించిందన్నారు. ఆ కవర్‌ను పోలీసులు తెరిచి పరిశీలించగా అందులో ఒక కేజీ 270 గ్రాముల గంజాయి లభ్యమైంది. ఆటోలోని వారిని అరెస్టు చేసి, వాహనాన్ని సీజ్ చేశారు. గంజాయి తరలిస్తున్న దుండగులను పట్టుకున్న ఎస్‌ఐ మనోజ్, కానిస్టేబుల్ రవి, మహేష్, కైసర్, సాయికుమార్‌ను ఏసీపీ అభినందించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌కు నెల జైలు

మాక్లూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లిలో గురువారం పాఠశాల బస్సును ఢీ కొట్టిన ఘటనలో లారీ డ్రైవర్‌కు మెజిస్ట్రేట్ నెల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. లారీ డ్రైవర్ దావుద్ బేగ్ నిర్లక్ష్యంగా నడుపడంతో ఎదురుగా వెళ్తున్న స్కూల్ బస్సును వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో మాక్లూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అనంతరం చేపట్టిన దర్యాప్తులో లారీ డ్రైవర్ మద్యంమత్తులో వాహనం నడిపినట్లు నిర్ధారణ కావడంతో అతడిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు కూడా నమోదు చేశారు. శుక్రవారం డ్రైవర్‌ను స్పెషల్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా నిందితుడికి నెల జైలు శిక్ష విధించారు.

కానిస్టేబుళ్లకు బెదిరింపు..హోటల్ యజమానిపై కేసు

ఎడపల్లి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకంపేటలోని అలీసాగర్ చౌరస్తా వద్ద ఉన్న హోటల్ యజమాని అల్తాఫ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ముత్యాల రమ తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి కానిస్టేబుళ్లు నరేష్, హేమంత్ విధి నిర్వహణలో భాగంగా బ్లూకోర్ట్ డ్యూటీలో ఉండగా రాత్రి 10 గంటల సమయంలో జానకంపేటలోని అలీసాగర్ చౌరస్తాలో గల అల్తాఫ్ అనే వ్యక్తి హోటల్ తెరిచి ఉంచడంతో కానిస్టేబుళ్లు వెళ్లి, రాత్రి అయింది హోటల్‌ను మూయాలని కోరగా, దానికి హోటల్ యజమాని అల్తాఫ్ నేను హోటల్ మూయను, ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ కానిస్టేబుళ్లను దుర్భాషలాడారు. వారిని చేతులతో నెట్టి వేయడంతో విధులకు ఆటంకం కలిగించారని తెలిపారు. ఈ విషయమై కానిస్టేబుల్ నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించామని వివరించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

నసురుల్లాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎవరైనా పేకాట ఆడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై రాఘవేంద్ర అన్నారు. శుక్రవారం మండలంలోని నెమ్లి శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పట్టుకొని వారిపై కేసు నమోదు చేశారు. వారి నుంచి 4 సెల్‌ఫోన్లు, రూ.3970 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

నాగిరెడ్డిపేట: మండలంలో శుక్రవారం తెల్లవారుజామున రెండు పేకాట స్థావరాలపై పోలీసులు దాడిచేసి పేకాట ఆడుతున్న 8 మంది పేకాటరాయుళ్లను పట్టుకున్నట్టు ఎస్సై భార్గవ్‌గౌడ్ తెలిపారు. మండలంలోని జలాల్‌పూర్‌లోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారం మేరకు దాడి చేసి నలుగురి నుంచి పట్టుకొని వారి నుంచి 13,380 రూపాయల నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అలాగే కన్నారెడ్డి గ్రామంలోని కల్లు కాంపౌండ్‌లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేసి నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.4,160 నగదు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఇసుక డంప్ స్వాధీనం

భీమ్‌గల్ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోనుగొప్పులలో హరిహర రైస్ మిల్ ప్రాంగణంలో అక్రమంగా డంప్ చేసిన సుమారు 95 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను గురువారం సీజ్ చేసినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. సీజ్ చేసిన ఇసుకను ఈ నెల 10వ తేదీన ఉదయం 11 గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో బహిరంగా వేలం పాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనే వ్యక్తులు రూ.10వేల డిపాజిట్ కట్టి హాజరుకావాలన్నారు.

బోధన్: బోధన్ మంజీరా పరీవాహక ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు వాహనాలను పట్టుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ తెలిపారు. శుక్రవారం ఎలాంటి అనుమతులు, పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు వివరించారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



నినాదాలు చేస్తున్న దళిత సంఘాల నాయకులు

వేల్పూర్‌లో జాతీయ విద్యార్థి దినోత్సవం

వేల్పూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో శుక్రవారం అంబేడ్కర్ యువజన సంఘం, దళిత సంఘాల ఆధ్వర్యంలో జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రాజాసాతరలో రాజావాడ చౌక్‌లో ఉన్న ప్రతాప్ సింగ్ ఉన్నత పాఠశాలలో అంబేడ్కర్ మొదటిసారిగా బడిలో ప్రవేశించిన రోజు నవంబరు 7ను జాతీయ విద్యార్థి దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏవైఎస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్, కార్యవర్గ సభ్యులు జాంబవచామర్, ఉపాధ్యక్షుడుదాస్, సలహాదారు క్రాంతి తదితరులున్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

వేల్పూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమీనాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందుతున్న సరస్వతిని శుక్రవారం పీఆర్‌టీయూ నాయకులు సన్మానించారు. 42 సంవత్సరాల ఉద్యోగ ప్రస్థానంలో ఎందరో విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లిన ఘనత సరస్వతికి దక్కిందని పీఆర్‌టీయూ మండల అధ్యక్షకార్యదర్శులు దేవనందం, నర్సింహారావు కొనియాడారు. కార్యక్రమంలో జలందర్, లక్ష్మణ్, రాణి, విజయ్‌కుమార్, రవీందర్, సురేష్, అంజలి, రిటైర్డ్ హెచ్‌ఎం రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఇందూరు బిడ్డలు

ఆర్మూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మగ్గిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం హరిత, పీఈటీ మధు తెలిపారు. ఇటీవల కలిగోట్‌లో జరిగిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బీచ్ వాలీబాల్ ఎస్‌జీఎఫ్ అండర్ -17 పోటీలలో మొదటిస్థానం సాధించడమే కాకుండా రాష్ట్రస్థాయికి విద్యార్థినులు ప్రతిభ, విజ్ఞత, రిషిప్రియ ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ నెలలో ఖమ్మంలో జరిగే రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను శుక్రవారం అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం హరిత

సాఫ్ట్‌బాల్ పోటీలకు గంగోత్రి..

జక్రాన్‌పల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీనియర్ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ పోటీలకు మండలంలోని తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఆర్.గంగోత్రి ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు గంగమోహన్ తెలిపారు. జగిత్యాలలో శుక్రవారం నుంచి ఈనెల 9వ తేదీ వరకు జరిగే పోటీల్లో గంగోత్రి పాల్గొంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గంగోత్రిని ఎంఈవో శ్రీనివాస్ వీడీసీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ ఎర్రొల్ల గంగాధర్, కార్యదర్శి భూమేశ్వర్ పాల్గొన్నారు.



ఆర్.గంగోత్రిని అభినందిస్తున్న ఎంఈవో శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం

కళా ఉత్సవ్‌లో రెండో బహుమతి

నవీపేట,నవంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోకన్‌పల్లి కేజీబీవీకి చెందిన ఐశ్వర్య శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కళాఉత్సవ కార్యక్రమంలో విజువల్ త్రిడీ విభాగంలో రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతిని ఆర్‌జేడీ రాజీవ్ చేతుల మీదుగా అందుకున్నారని పాఠశాల ప్రత్యేక అధికారిణి కవిత తెలిపారు. ఈ సందరంగా ఐశ్వర్యను వారు అభినందించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి శ్రీనాథ్, ఉపాధ్యాయురాలు వీణ ఉన్నారు.



మోకన్‌పల్లి కేజీబీవీ విద్యార్థిని ఐశ్వర్యను అభినందిస్తున్న ఆర్‌జేడీ రాజీవ్, తదితరులు

ప్రతిభ చాటిన వజ్రాంష్..

విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కళా ఉత్సవం-2025లో మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి వజ్రాంష్ రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి గెలుపొందాడని కరస్పాండెంట్ హన్మాండ్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి పొందడంతో పాటు జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు వజ్రాంష్ ఎంపికయ్యాడని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

నవీపేట, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ట్రాన్స్‌కో ఏడీఈ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. రెండో శనివారం సందర్భంగా సబ్ స్టేషన్‌లో మరమ్మతుల్లో భాగంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ ఉండదన్నారు. మండలంలోని జన్నేపల్లి, కమలాపూర్, నిజాంపూర్, నాళేశ్వర్‌లలోని 33/11కేవీ సబ్ స్టేషన్ల పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6గంటల వరకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.



ప్రశాంత్ కిరణ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పీఆర్‌టీయూ మండల ప్రధానకార్యదర్శిగా ప్రశాంత్ కిరణ్

కోటగిరి,నవంబరు7(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండల పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్ కిరణ్ బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాకేంద్రంలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రశాంత్ కిరణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ తీర్మానం చేశారు. పీఆర్‌టీయూ మండల కార్యదర్శిగా ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ నేతలు మోహన్‌రెడ్డి, కిషన్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

25న మహాసభ

నవీపేట,నవంబరు7(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈ నెల 25న జరిగే కేవీపీఎస్ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ కోరారు. శుక్రవారం ఆయన నవీపేటలో మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ భవన్‌లో జరిగే మహసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గౌతం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర ఆలయ ప్రారంభం

పెర్కిట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మునిసిపల్ పరిధిలోని పెర్కిట్‌లో శుక్రవారం శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన, ఆలయ ప్రారంభ కార్యక్రమాలు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీ గురు మదనానంద సరస్వతి పీఠాదీశ్వరుడు మాధవానంద సరస్వతి స్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణం కనులపండువగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారి ఆశీస్సులు పొందారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడే బచ్చేవాల్ నవభోజరాజు, కోశాధికారి నచ్చు గంగాధర్, కార్యదర్శి శ్రీనివాస్, సభ్యులు సత్యానందం, పాలెపు రాజు, ఆలకుంట రాజు, తదితరులు పాల్గొన్నారు.





కల్యాణం జరిపిస్తున్న దృశ్యం, పాల్గొన్న భక్తులు

నీటిట్యాంకుల ధ్వంసంపై డీఈ ఆగ్రహం

కోటగిరి,నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రక్షిత మంచి నీటి మినీ ట్యాంకులను ధ్వంసం చేయడంపై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మున్నీనాయక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోతంగల్ మండలంలోని కొడిచర్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఈ విషయమై విచారణ జరిపారు. మినీ వాటర్ ట్యాంకులను ఎందుకు ధ్వంసం చేశారని పలువురిని ప్రశ్నించారు. ప్రభుత్వ ట్యాంకులను ధ్వంసం చేయడం చట్టరీత్యా నేరమని సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయమై స్పందించిన పలువురు గ్రామంలో అలంకరప్రాయంగా మారడంతో తొలగించాల్సి వచ్చిందని వివరించారు. ట్యాంకులను ఏర్పాటు చేసేందుకు సహకరిస్తామని గ్రామస్థులు హామీ ఇచ్చారు. త్వరితగతిన కొత్త ట్యాంకులను ఏర్పాటు చేయకపోతే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చందర్, ఏఈ ధన్‌రాజ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



కొడిచర్లలో విచారణ జరుపుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మున్నీనాయక్



ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న కరస్పాండెంట్

పుస్తక పఠనంలో విద్యార్థినుల ప్రతిభ

ఆర్మూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంలో పోటీల్లో శ్రీభాషిత పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి మొదటి రౌండ్‌లో ప్రతిభ కనబర్చి రెండో రౌండ్‌కు ఎంపికైనట్లు కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ తెలిపారు. దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాల నుంచి 5వేల మంది విద్యార్థులకు నిర్వహించిన రీడ్ ఇండియా సెలబ్రేషన్స్ 2025 పుస్తక పఠన పోటీల్లో శ్రీభాషిత విద్యార్థులు అలీన తహరీన్ ఇంగ్లీష్, జూనేర తహరీన్ హిందీ పుస్తక పఠనంలో ప్రతిభ కనబర్చారన్నారు. విద్యార్థులు చదువులోనే కాకుండా ఇతర పోటీలలో ముందుండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రతిమా చావ్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బద్ది పోచమ్మకు బోనాలు



గోవూర్‌లో బోనాలు సమర్పిస్తున్న మహిళలు

మోస్రా,నవంబరు7(ఆంధ్రజ్యోతి): భీమన్న పండుగ సందర్భంగా శుక్రవారం శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారికి గోవూర్ గ్రామ నాయకపోడు సంఘం ఆధ్వర్యంలో బోనాలు సమర్పించారు. ఈ పండుగను ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో కుల దేవుళ్లు అయిన భీమన్న, బద్ది పోచమ్మ దేవతలకు పండగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని ఆదివాసీ నాయక్ పోడ్ కుల సంఘం సభ్యులు తెలిపారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

నవీపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహంతంలో దేవాలయ యంత్ర, విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు రెండవ రోజైన శుక్రవారం కొనసాగాయి. గ్రామంలో ఇటీవల నూతనంగా పెద్ద పోచమ్మ, భూలక్ష్మమ్మ, ఐదు చేతుల పోచమ్మ, మారెడమ్మ, నల్ల పోచమ్మ దేవాలయాలను నిర్మించారు. ఉత్సవాలలో భాగంగా శుక్రవారం ప్రాతఃకాల పూజ, మంటప ఆరాధన, మూలమంత్ర హోమాలు, యంత్ర, విగ్రహాలకు అభిషేకం, ధాన్యాధివాసం, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా చివరి రోజైన శనివారం విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



మహంతంలో యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం



రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో

సాదాబైనామా దరఖాస్తులను
వెంటనే పరిష్కరించాలి

▸▸ బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

కోటగిరి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): సాదాబైనామా దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సూచించారు. కోటగిరి తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం సబ్ కలెక్టర్ వికాస్ మహతో సందర్శించారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల వివరాలను తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. సాదాబైనామాకు వచ్చిన దరఖాస్తులలో ఎన్నింటిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు, పరిశీలించిన విధానాన్ని, ఇప్పటి వరకు పరిష్కరించిన సాదాబైనామా దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఎలాంటి భూ సమస్యలు లేకుండా చూడాలన్నారు. తహసీల్దార్ పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మిగతా వాటిని ఉన్నతాధికారులకు నివేదించాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి

రెంజల్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): రైతుల కోసం ఏర్పాటుచేసిన సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని నీలా సహకార సంఘం ప్రత్యేక అధికారి అశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం నీలా సహకార సంఘం ఆధ్వర్యంలో వనదుర్గ ఆలయం వద్ద సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి రైతుకు సోయాబిన్‌కు ప్రభుత్వం క్వింటాలుకు రూ.5328 మద్దతు ధరను అందిస్తుందని, ఈ సదావకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తాము పండించిన సోయాబీన్ పంటను దళారుల పాలు చేయకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధరను పొందాలన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం కార్యదర్శి రాందాస్, మాజీ చైర్మన్ ఇమాం బేగ్, కాంగ్రెస్ నేతలు గంగా కిషన్, ఎంఎల్ రాజు, కందకుర్తి మాజీ ఉప సర్పంచ్ యోగేష్, మాజీ ఎంపీటీసీ అసద్, ఏఈఓలు సాయిలు, గోపీకృష్ణ పాల్గొన్నారు.



నీలాలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం



రుద్రూరులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉచిత వైద్య శిబిరం

రుద్రూరు,నవంబరు7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బోయి సంఘంలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ రుద్రూర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యులు, దంత వైద్యులు పాల్గొని రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందించారు. ఈ శిబిరంలో 126మంది రోగులకు వైద్య సేవలను అందించారు. ఇందులో 32మందికి ఆపరేషన్ అవసరం ఉన్నందున ఉచిత కంటి ఆపరేషన్ నిమిత్తం లయన్స్ కంటి ఆసుపత్రికి పంపించారు. ఈకార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి లయన్ గుండూరు ప్రశాంత్ గౌడ్, జిల్లా చైర్మన్ లయన్ శ్యాంసుందర్ పహాడే, గాండ్ల మధు, మంజురి సీతారాం, మంజరి రాజు, బోయి సంఘం అధ్యక్షులు సాయిలు, లక్ష్మణ్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ

బోధన్,నవంబరు7(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని పెంటాకలాన్ గ్రామంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సహకారంతో పెంటాకలాన్ గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ నిర్వహించినట్లు టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ తెలిపారు. ఉపాధిహామీ నిధుల నుంచి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు రాజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు సంజీవ్ రెడ్డి, సుదర్శన్‌లతో గ్రామ పెద్దలు, గ్రామస్థులు, అంగన్‌వాడీ టీచర్‌లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



పెంటాకలాన్‌లో భవన నిర్మాణపనులు ప్రారంభిస్తున్న దృశ్యం

ఇందిరమ్మ ఇళ్లతో పేదల కల సాకారం

రెంజల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిరుపేదల సొంత ఇంటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశ పెట్టిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోబిన్ ఖాన్ పేర్కొన్నారు. మండలంలోని కందకుర్తిలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నాయకులు పట్టాలను పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ పథకం ద్వారా ఇళ్లను అందజేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం మండలంలోని కందకుర్తిలో అర్హులకే లబ్ధిదారులను గుర్తించి వారికి ఇందిరమ్మ పట్టాలను అందించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కమలాకర్, ఎంపీఓ రఫీ అహ్మద్, కాంగ్రెస్ నాయకులు గయాజ్, సాయరెడ్డి, జావీదుద్దీన్, సిరాజ్, ఇర్షాద్ తదితరులు ఉన్నారు.



కందకుర్తిలో లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేస్తున్న మోబిన్

రాష్ట్ర స్థాయి సీనియర్ ఖోఖో పోటీలకు
గురుకుల విద్యార్థుల ఎంపిక



మద్నూర్ గురుకులం నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మద్నూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి సీనియర్ ఖోఖో పోటీలకు మద్నూర్ బాలుర గురుకుల విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ గణేష్ తెలిపారు. గత నెలలో జరిగిన నిజామాబాద్ జిల్లాస్థాయి సీనియర్ ఖోఖో పోటీల్లో వీరు ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. గురుకుల కళాశాలలో చదువుతున్న జగదీష్ 9వ క్లాస్, రుతిక్ ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు ఎంపిక కావడంపై గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, ఉపాధ్యాయులు అభినందించారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 7 నుంచి పెద్దపల్లి జిల్లాలో జరిగే 58వ రాష్ట్రస్థాయి సీనియర్ ఖోఖో పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. అలాగే ఇదే గురుకుల నుంచి పాఠశాల నుంచి అరవింద్ ఫస్ట్ ఇయర్ విద్యార్థి ఎస్‌జీఎఫ్ యూ/17 రాష్ట్రస్థాయి కబడ్డీపోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 8 నుంచి 10 వరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులకు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర్, వ్యాయామ ఉపాధ్యాయులు గణేష్, నాగరాజు, ఉపాధ్యాయ బృందం వారిని అభినందించింది.

బ్లాక్‌మెయిలింగ్..

- అక్రమ రవాణాదారుల నుంచి ప్రైవేట్ వ్యక్తుల డబ్బులు వసూళ్లు
- అధికారుల తనిఖీలు శూన్యం
- చర్యలు తీసుకోవాలని డిమాండ్
- పట్టించుకోని అధికారులు

బాన్సువాడరూరల్, నవంబరు 7: పలువురు వ్యాపారులను ప్రైవేట్‌వ్యక్తులు బ్లాక్‌మెయిలింగ్ చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇసుక, మొరం, బియ్యం రవాణా చేస్తున్న వ్యాపారులపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొంతమంది ఇదే అదునుగా గ్రూపులుగా ఏర్పడి వారిని బ్లాక్‌మేల్ చేస్తున్నారు. అక్రమ వ్యాపారాలు చేస్తున్న వారిని టార్గెట్ చేస్తూ రాత్రులు వాహనాల్లో తిరుగుతున్నారు. వాహనాలను అడ్డుకుని డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. వారు అడిగినంత ఇవ్వకపోతే పోలీసులకు పట్టిస్తున్నారు. బాన్సువాడ మండలంలోని కోనాపూర్ గ్రామంలో ఇటీవల అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇసుక టిప్పర్‌ను అడ్డుకుని డ్రైవర్‌ను బెదిరించి డబ్బులు డిమాండ్ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. టిప్పర్ ఇసుకను తరలిస్తుండగా గ్రామశివారులో కొందరు వ్యక్తులు అడ్డుకున్నారు. అక్రమ రవాణా చేస్తున్నట్లు ఆరోపిస్తూ డ్రైవర్‌పై ఒత్తిడి తెచ్చి నగదును డిమాండ్ చేసినట్లు ఆరోపణలున్నాయి. వారు అడిగినంత ఇవ్వకపోవడంతో పోలీసులకు సమాచారం అందించి టిప్పర్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు సమాచారం.

క్యాష్ చేసుకుంటున్న బ్లాక్‌మెయిలర్లు..

అక్రమ రవాణా నిరోధం పేరుతో కొంతమంది వ్యక్తులు స్వప్రయోజనాలకోసం డబ్బులు వసూళ్లు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమ వ్యాపారాలను అడ్డుకునేందుకు సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వీరి ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతుందన్నారు. మరికొంత మంది అధికారులు బ్లాక్‌మెయిల్ చేస్తున్న వ్యక్తులకు అండగా ఉంటున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.



పోలీసులు పట్టుకున్న ఇసుక టిప్పర్ (ఫైల్)

● రాత్రుల్లో పోలీసులు నిఘా పెట్టాలి..

రాత్రి సమయాల్లో అక్రమ వ్యాపారాలు, రవాణాపై పోలీసులు నిఘా పెట్టి కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. బాన్సువాడ మండలంలో రాత్రుల్లో గ్రూపులుగా ఏర్పడి వ్యక్తులు ప్రధాన రహదారిపై విజిలెన్స్ అధికారులమంటూ డబ్బులు దండుకున్న సందర్భాలూ ఉన్నాయి. డబ్బులు ఇవ్వకుంటే తమకు సన్నిహితంగా ఉండే పోలీసులకు సమాచారం అందజేసి పట్టిస్తున్నారనే ఆరోపణలున్నాయి. డబ్బులు వసూలు చేస్తున్న బ్లాక్‌మెయిలర్లను గుర్తించి పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పాఠాలు బోధించిన డీఐఈవో



మద్నూర్ ప్రభుత్వ కళాశాలలో లెక్చరర్‌గా మారి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న డీఐఈవో

మద్నూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలని జిల్లా డీఐఈవో ఏ.వొడ్డెన్న శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా విద్యార్థులకు లెక్చరర్‌గా మారి పాఠాలు బోధించారు. అనంతరం కళాశాలకు మంజూరైన రూ.36 లక్షల పనులు చేపట్టకపోవడంపై ప్రశ్నించారు. ప్రభుత్వం కళాశాలకు మంజూరు చేసిన నిధుల పనులపై ఏఈ అరుణ్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిధులు మం జూరు చేసినా టెండర్ కాలేదని ఏఈ వెల్లడించారు. ఆయనతో పాటు కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ఆడిట్

పెద్దకొడప్‌గల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాలలో గత సంవత్సరం నిర్వహించిన ఉపాధిహామీ పథకంలో పనిచేయకున్నా కూలీ డబ్బులు తీసుకున్నట్లు ఉపాధిహామీ సోషల్ ఆడిట్‌లో బహిర్గతమైంది. మండలంలో గత సంవత్సరం ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన అంశాలపై ఆయా గ్రామాలలో సోషల్ ఆడిట్ బృందం వారు ఆడిట్ నిర్వహించారు. ఇందుకు సంబంధించిన అంశాలను మండల కేంద్రంలోని రైతువేదికలో జరిగిన ప్రజావేదికలో పలు అంశాలను వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఏపీడీ వామన్‌రావ్ హాజరు కాగా ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలలో ఉపాధి హామీ పథకానికి సంబంధించిన ఫీల్డ్‌అసిస్టెంట్లు, మేట్‌లు పనిచేయని వారికి కూలీలు చెల్లించినట్లు గుర్తించి వివరాలు వెల్లడించారు. మరికొన్ని చోట్ల ఒకరికి బదులు మరొకరికి డబ్బులు చెల్లించారని సీఆర్‌పీలు వెల్లడించారు. అంతేగాక పనులు జరిగిన చోట అందుకు సంబంధించిన గుర్తింపు పలకలను ఏర్పాటు చేయలేదని వెల్లడించారు. ఇక కాటేపల్లి గ్రామంలో గత సంవత్సరం నుంచి 66 మంది కూలీలు పనులు కావాలని దరఖాస్తు చేసినప్పటికీ పనులు కల్పించలేదన్నారు. అనంతరం ఏపీడీ వామన్ రావ్ మాట్లాడుతూ ఏ గ్రామంలో అయితే పనిచేయకుండా కూలీడబ్బులు చెల్లించారో సంబంధిత బాధ్యుల నుంచి రికవరీ చేయాలని సూచించారు. ఉపాధిహామీ పథకంలో అక్రమాలు జరగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బీఆర్ అభినవ్ చందర్ ఎంపీవో లక్ష్మీకాంత్ రెడ్డి, ఏపీవో సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



ఆడిట్ వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

మహిళలు తమను తాము రక్షించుకోవాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న మోపాల్ ఎస్సై

మోపాల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఎదుర్కోవాలంటే మహిళలు తమను తాము రక్షించుకోవాలని మోపాల్ ఎస్ఐ సుష్మిత సూచించారు. శుక్రవారం మోపాల్ మండల కేంద్రంలో ఉన్న కేజీబీవీ పాఠశాలకు షీటీమ్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆడపిల్లల భద్రత అత్యవసర పరిస్థితుల్లో తమను తాము ఏ విధంగా రక్షించుకోవాలి, సోషల్ మీడియా, సైబర్ నేరాలలో ఆడవారు, చిన్నపిల్లలు బలవుతున్న అంశాలపై అవగాహన కల్పించారు. పిల్లల సమస్యలను తెలుసుకోవడానికి ఫిర్యాదుల బాక్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. పిల్లలు వారి సమస్యలను పేపర్‌మీద రాసి బాక్సులో వేయాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు.

కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



కొచ్చేరి మైసమ్మ అమ్మవారు

నసురుల్లాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామశివారులో గల కొచ్చేరి మైసమ్మ ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం కొచ్చేరి మైసమ్మ తల్లి అని అన్నారు. అనంతరం భక్తులు కుటుంబసభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహపంక్తి భోజనాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

రాంపూర్‌లో జ్యోతిబాపూలే పాఠశాల తనిఖీ



వంట తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి

ఇందల్వాయి, నవంబర్ 7(ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి మండలంలోని రాంపూర్ గ్రామంలో గల మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్ తదితర వాటిని పరిశీలించారు. స్టోర్‌రూమ్‌లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, కోడిగుడ్లు, ఇతర సరుకుల నాణ్యతను, విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు పలుసూచనలు చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, ఆహారపదార్థాలను భద్రపరిచే విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం తయారు చేసేలా చూడాలన్నారు. భోజనం వండడానికి ముందే ఆహార పదార్థాల నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించాలని, కాలం చెల్లిన పదార్థాలు వినియోగించకూడదని సూచించారు. నాసిరకమైన బియ్యం, నూనె, ఇతర సరుకులు సరఫరా జరిగితే వెంటనే అధికారుల దృష్టికి తేవాలని, వాటి స్థానంలో నాణ్యమైన సరుకులను సమకూర్చేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు. నిర్లక్ష్యానికి తావివ్వకుండా, మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సతీష్, పాఠశాల ప్రిన్సిపాల్ నరేందర్, స్థానిక అధికారులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



బ్రాహ్మణపల్లిలో చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

తాడ్వాయి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో శుక్రవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేసినట్లు మండల అధ్యక్షుడు జూకంటి వెంకట్‌రెడ్డి తెలిపారు. అనంతరం అధ్యక్షులు మాట్లాడుతూ ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పేద ప్రజలకు ఇలాంటి చెక్కులు అందించడం వల్ల ఎంతో మేలు జరుగుతుంది అన్నారు. బ్రాహ్మణపల్లి గ్రామంలో 48,500 రూపాయల చెక్కును పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు గైని శివాజీ, నాయకులు వెంకట్ రామ్ రెడ్డి, గ్రామ అధ్యక్షుడు తూర్పు రాజు, నర్సరెడ్డి, తిరుపతి, మల్లేశ్, గంగారెడ్డి వరుణ్, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యాలతో ఉపాధి అవకాశాలు

సుభాష్‌నగర్, నవంబరు 7, (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సామర్థ్యాలు మెరుగుదిద్దుకుంటే ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రొఫెసర్ హుస్సేని అలాం, ప్రసన్న ఖడ్గికర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని జీజీ కళాశాలలో వాణిజ్య నిర్వహణ ఉపాధి అవకాశాలపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యవక్తలుగా హాజరైన వారు మాట్లాడుతూ వాణిజ్య రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయన్నారు. సాంకేతిక నైపుణ్యాలు నేర్చుకుంటే ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్, కామర్స్ విభాగం అధిపతి వినయ్‌కుమార్, పీఆర్వో దండుస్వామి, డాక్టర్ రాజేష్, అదనపు అకాడమిక్ కో-ఆర్డినేటర్‌లు మహేదాబేగం, రాహుల్, తెలుగు విభాగ అధిపతి డాక్టర్ రామస్వామి, అధ్యాపకులు రజిత, సమంత, సంతోష్‌కుమార్‌గౌడ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీని విజయవంతం చేయండి



బాన్సువాడ మినీస్టేడియం శుభ్రం చేయిస్తున్న అధికారులు

బాన్సువాడటౌన్ , నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మినీస్టేడియంలో సోమవారం నుంచి నిర్వహించే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని మండల విద్యాధికారి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన మినీస్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను వ్యాయామ ఉపాధ్యాయులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు విచ్చేసి టోర్నమెంట్‌లో పాల్గొనాల్సిందిగా కోరారు. మరిన్ని వివరాలకు బాన్సువాడ మినీస్టేడియంలో సంప్రదించాలని ఆయన అన్నారు.

ప్రకాష్‌రావు క్యాంపులో ఉచిత వైద్య శిబిరం



ప్రకాష్‌రావు క్యాంపులో రోగులను పరీక్షిస్తున్న దృశ్యం

బీర్కూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రకాష్‌రావు క్యాంపులో శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిక్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. శిబిరంలో 42 మందికి షుగర్ టెస్టులు చేశారు. అయితే ఇందులో ఐదుగురికి షుగర్ ఉన్నట్లు గుర్తించారు. వారికి బీర్కూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షుడు రమేష్, సీనియర్ లయన్స్ కిషోర్‌దాస్, రషీద్, కిరణ్, ప్రవీణ్, ప్రసాద్, సత్యనారాయణ, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ చాంపియన్‌షిప్‌నకు సిర్నాపల్లి విద్యార్థి

ఇందల్వాయి, నవంబర్7(ఆంధ్రజ్యోతి) : ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలుర కబడ్డీ చాంపియన్‌షిప్ కు సిర్నాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న శ్రీనివాస్ జిల్లా కెప్టెన్‌గా ఎంపిక అయ్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు రాజకుమార్ శుక్రవారం తెలిపారు. చాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు భద్రాద్రి కొత్తగూడెంలో జరుగుతాయన్నారు. ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి ఎంపిక చేసిన క్రీడాకారుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి శ్రీనివాస్ ఉమ్మడి జిల్లాకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారన్నారు. ఎంపికైన శ్రీనివాస్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, వీడీసీ సభ్యులు, గ్రామ ప్రముఖులు ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు



ఎంపికైన విద్యార్థితో వ్యాయామ ఉపాధ్యాయుడు

ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

బీర్కూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ పథకంలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణపనులు ప్రారంభించాలని ఎంపీడీవో శ్రీనిధి లబ్ధిదారులకు సూచించారు. శుక్రవారం ఆమె వీరాపూర్, తిమ్మాపూర్ గ్రామాల్లో పర్యటించారు. రెండు గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. అనంతరం ఇళ్ళు మంజూరై ఇంకా పనులు ప్రారంభించని లబ్ధిదారుల వివరాలను గ్రామపంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. వారిని గ్రామపంచాయతీకి పిలిపించి సమావేశం నిర్వహించారు. ఇళ్లు మంజూరు అయినా ఇంకా పనులు ఎందుకు మొదలు పెట్టలేదని లబ్ధిదారులను అడిగారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని సూచించారు. ఆమె వెంట సూపరింటెండెంట్ భానుప్రకాష్, గ్రామపంచాయతీ కార్యదర్శులు దివ్య, శ్రీనివాస్ ఉన్నారు.



తిమ్మాపూర్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న దృశ్యం

ఉత్సాహంగా నారాయణ ప్రీమియర్ లీగ్ పోటీలు



మాట్లాడుతున్న డీఈవో

సుభాష్‌నగర్, నవంబరు 7, (ఆంధ్రజ్యోతి) : నారాయణ ప్రీమియర్ లీగ్ జోనల్ లెవల్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. జిల్లాకేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో ఆదిలాబాద్, నిజామాబాద్ జోనల్ పోటీలను డీఈవో అశోక్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో అశోక్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి జట్టుకృషి ఆరోగ్యకరమైన పోటిని ప్రొత్సహించడం లక్ష్యంగా క్రీడా పోటీలు అవసరమని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో పట్టుసాధించాలని అన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శివాజీ, ప్రసాద్, నారాయణ స్కూల్ రిజనల్ డైరెక్టర్ సంగీత, కొఆర్డినేటర్ రాకేష్, కల్పన, నరేష్, కల్యాణి, ప్రిన్సిపాల్స్ చందన, రజని, కిషోర్, పార్వతి, స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో అభివృద్ధి పనులు

రామారెడ్డి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో రూ. 40 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను శుక్రవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు శంకుస్థాపన నిర్వహించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కాలనీలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. కాంగ్రెస్ నాయకులు, ప్రజల విజ్ఞప్తిపై ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు వెంటనే స్పందించి, సీఆర్ఆర్ నిధుల ద్వారా రూ.40 లక్షలు మంజూరు చేశారు. కార్యక్రమంలో రామారెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మొగుళ్ళ ప్రవీణ్‌గౌడ్, సదాశివనగర్ ఏఎంసీ చైర్మన్ సెగ్యా నాయక్, మండల యూత్ అధ్యక్షుడు పిప్పిరి గణేష్, మండల ఉపాధ్యక్షుడు ల్యాగల ప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్ ఎండీ రావుఫ్, బీసీసెల్ అధ్యక్షుడు జేసీబీ శేఖర్, సీనియర్ నాయకులు బీపేట నర్సింలు, బండిప్రవీణ్, రంగు రవీందర్ గౌడ్, ఎండీ అద్నాన్, అంబాయి దాసు, బిట్ల నరసింగ్ రావు, భాస్కర్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే



ఇందిరమ్మ లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించాలి

▸ మండల అభివృద్ధి అధికారి సయ్యద్ సాజిద్ అలీ

తాడ్వాయి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన లబ్ధిదారులు ఇందిరమ్మ త్వరగా నిర్మించుకోవాలని మండల అభివృద్ధి అధికారి సయ్యద్ సాజిద్ అలీ అన్నారు. ఈయన శుక్రవారం మండలంలోని కన్‌కల్, కరడ్‌పల్లి గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారుల ఇంటికి వెళ్లి మాట్లాడారు. లబ్ధిదారులు ఇళ్లను కచ్చితంగా నిర్మించుకోవాలని సూచించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఒకవేళ ఇంటిని నిర్మించుకోకుంటే శాశ్వతంగా ఇందిరమ్మ ఇళ్లకు అనర్హులుగా ప్రకటించే అవకాశం ఉందన్నారు. ఇందులో ఇందిరమ్మ సమన్వయ కమిటీ సభ్యులు ప్రతాప్‌రెడ్డి, ఆయా గ్రామాల కార్యదర్శులు వీవోఏలు, లబ్ధిదారులు, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ అరుణ

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

బాన్సువాడ రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని తాడ్కోల్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఏడీఏ అరుణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని ఆరబెట్టి తేమ శాతం 17లోపు వచ్చినప్పుడు మాత్రమే కొనుగోలు కేంద్రానికి తరలించాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలన్నారు. తేమ అధికంగా ఉన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో స్వీకరించరని, కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా సాగేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి కృష్ణ, ఏఈవో రాణి, సొసైటీ వైస్ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



టీఎన్‌జీవోస్ సభ్యత్వం తీసుకుంటున్న పంచాయతీ కార్యదర్శులు

టీఎన్‌జీవోస్‌లోకి పంచాయతీ కార్యదర్శులు

కామారెడ్డి టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని మండలాల పంచాయతీ కార్యదర్శులు టీఎన్‌జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో టీఎన్‌జీవోస్‌లో చేరినట్లు జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తెలిపారు. పంచాయతీ కార్యదర్శుల సమస్యలన్నింటికీ పరిష్కారం టీఎన్‌జీవోస్ ద్వారా మాత్రమే దొరుకుతుందని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పట్ల, హక్కుల సాధన కోసం చిత్తశుద్ధితో టీఎన్‌జీవోస్ మాత్రమే పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్‌సీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందిళ్ల బలరాం, జిల్లా కార్యదర్శి నాగరాజు, కోశాధికారి దేవరాజు, ఉపాధ్యక్షుడిగా శ్రావణ్, లక్ష్మణ్, పోచయ్య, ఈసీ మెంబర్ శ్రీకాంత్, పంచాయతీ సెక్రెటరీల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మహేష్, ప్రవీణ్, రమేష్, రాజు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి పురస్కారాల అందజేత

కామారెడ్డి టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కామారెడ్డి బస్సు డిపోలో పనిచేసే డ్రైవర్‌లు, కండక్టర్‌లకు ప్రగతి చక్రం పురస్కారాలను నిజామాబాద్ ఆర్‌ఎం జ్యోత్స్న అందించారు. కామారెడ్డి డిపోలోని డ్రైవర్‌లు జాఫర్‌అలీ, శ్రీనివాస్, రాములు, కండక్టర్‌లు సంధ్య, చంద్రకళ, పుష్పలత, గ్యారేజీ సిబ్బంది ప్రేమ్‌కుమార్, ఎలక్ట్రీషియన్ గంగారాంలు ప్రగతిచక్రం పురస్కారాలను అందుకున్నట్లు డీఎం దినేష్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ రీజినల్ మేనేజర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



ఎరువులను పరిశీలిస్తున్న అధికారులు

సరిపడా విత్తనాలను అందుబాటులో ఉంచాలి

గాంధారి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గాంధారి మండల కేంద్రంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో శుక్రవారం వ్యవసాయ శాఖ మండల అధికారి రాజలింగం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో విత్తనాల, ఎరువుల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేస్తున్న రైతులకు తప్పకుండా రశీదు ఇవ్వాలన్నారు. అనంతరం పోతంగల్ కుర్దు, గండివేట్, సర్వాపూర్ వరి కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు పాల్గొన్నారు

డ్రైనేజీ పనులను చేపట్టాలి



అధ్వానంగా తయారైన మురికికాలువ

బిచ్కుంద, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ముత్తూట్ ఫైనాన్స్ వద్ద ఉన్న డ్రైనేజీ శుభ్రపరుచకపోవడంతో భరించలేని దుర్వాసన వస్తుందని ప్రజలు, స్థానిక వ్యాపారులు ఆరోపిస్తున్నారు. పీతిరికుంట నుంచి మురికి నీరు ప్రవహిస్తుందని తెలిపారు. పట్టణంలో సెంట్రల్ లైటింగ్, నాలుగు వరుసల రోడ్డు పనుల్లో భాగంగా రెండు పక్కల డ్రైనేజీ నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్ సమీపాన మధ్యలో నిర్మాణ పనులు చేయకపోవడంతో నీరు నిలిచి దుర్వాసనతో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. త్వరితగతిన డ్రైనేజీ పనులు చేపట్టి ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



జాతీయ జెండాలతో ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

గర్వంగా.. గంభీరంగా..

- గానమై మోగిన వందేమాతరం
- జిల్లా వ్యాప్తంగా ఘనంగా 150 సంవత్సరాల పండుగ

స్వాతంత్ర్య పోరాటానికి, సమరయోధుల ఉత్సాహానికి, దేశ భక్తి జ్వాలకు ప్రతీకగా నిలిచిన వందేమాతర గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం శుక్రవారం సామూహిక గేయాలాపనకు శ్రీకారం చుట్టింది. ఊరూ, వాడా ఒక్కటై దేశభక్తి గేయాన్ని ఆలపించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రైవేటు సంస్థలు, స్వచ్ఛంద సంఘాల వరకు ఒకే సవ్వడిగా వందేమాతరాన్ని ఆలపించారు. కార్యాలయ ప్రాంగణాల్లో గేయాన్ని ఆలపిస్తూ జాతీయ ఏకతాస్ఫూర్తిని ప్రతిబింబించారు. స్వాంతంత్ర సమరకాలంలో ఈ గేయం స్ఫూర్తి నింపిన సంగతిని గుర్తుచేశారు. వందేమాతర గేయం రచించిన బంకిమ్‌చంద్ర చటోపాధ్యాయను జాతి కృతజ్ఞతగా స్మరించింది. స్వాతంత్ర్య మాంత్రిక గీతం మరోసారి గగనంలో ప్రతిధ్వనించింది.

- నెట్‌వర్క్



లింగంపేట కళాశాలలో వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న విద్యార్థులు



దోమ్లి ప్రభుత్వ ఆసుపత్రిలో వందేమాతరం గీతం ఆలపిస్తున్న సిబ్బంది



బాన్సువాడలో వందేమాతం ఆలపిస్తున్న ఎంపీడీవో, సిబ్బంది



నాగిరెడ్డిపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట..



పాఠశాలలో వందేమాతరం గేయం ఆలపిస్తున్న విద్యార్థులు



సబ్‌కలెక్టర్ కార్యాలయంలో గేయాన్ని ఆలపిస్తున్న అధికారులు



బీర్కూర్‌లో వందేమాతరం గేయం ఆలపిస్తున్న విద్యార్థులు

ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో ఆనంద్

బాన్సువాడ రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను 15 రోజుల్లో ప్రారంభించాలని, లేనిపక్షంలో వారి ఇళ్లు రద్దు చేస్తామని ఎంపీడీవో ఆనంద్ అన్నారు. శుక్రవారం బాన్సువాడ మండలంలోని హన్మాజీపేట్ గ్రామంలో ఎంపీడీవో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇంటికి వెళ్లి నిర్మాణ పనులను ప్రారంభించాలని సూచించి, గ్రామపంచాయతీ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో బాగంగా ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులను 15 రోజుల్లో ప్రారంభించాలని, లేనిపక్షంలో రద్దు అవుతుందన్నారు. కార్యక్రమంలో సూపరిండెంట్ ముజాహిద్, పంచాయతీ కార్యదర్శి రాజేష్, సీనియర్ నాయకులు సంజీవులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రమాద బీమా



మాట్లాడుతున్న ఎంపీడీవో

ఎల్లారెడ్డిరూరల్, నవంబరు 7: మండల పరిధిలోని అడవిలింగాల గ్రామపంచాయతీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు శుక్రవారం ఎంపీడీవో తాహెరా బేగం సమక్షంలో పోస్టల్ ఇన్సూరెన్స్ చేయించినట్లు తెలిపారు. ఈ సంద్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఆపత్కాలంలో జీవిత బీమా ఉంటే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్మికులందరూ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకుని ధీమాగా ఉండాలన్నారు. అడవి లింగాల పంచాయతీలో కార్మికులుగా పనిచేస్తున్న అశోక్, శివరాములు, బాలయ్యకు ఇన్సూరెన్స్ చేయించి బీమా సౌకర్యం కల్పించిన గ్రామకార్యదర్శి శంకరయ్యను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రకాష్, కార్మికులు, తపాల సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట జరిమానాల్లో చేతివాటం !

బాన్సువాడరూరల్, నవంబరు 7: జిల్లాలో పేకాట నిర్మూలనకు ఎస్పీ రాజేష్‌చంద్ర ప్రత్యేకంగా పేకాటస్థావరాలపై పోలీసులతో దాడులు చేయించారు. పేకాట ఆడుతున్న వ్యక్తులను పట్టుకుని పోలీసులు కేసులు నమోదు చేశారు. కోర్టు ద్వారా జరిమానాలు విధించి వారిలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. కాని మరో పక్కన కోర్టు విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది తమ చేతివాటన్ని ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేకాటలో పట్టుకున్న వారికి రూ.వెయ్యి జరిమానా విధిస్తే వారి నుంచి అదనంగా రూ.500లను వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల ఓ గ్రామానికి చెందిన నాయకుల వద్ద పేకాటలో జరిమానాకు అదనంగా రూ.500 తీసుకున్నట్లు, సదరు పోలీసు సిబ్బందిపై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీపావళి పండుగ సందర్భంగా పేకాట ఆడుతున్న వారి నుంచి డబ్బులు తీసుకున్నది మరువకముందే కోర్టు జరిమానాలో సైతం డబ్బులు దండుకోవడం పెద్ద చర్చకు దారి తీసింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్న పోలీసులపై, పేకాట ఆడే వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సంస్థ అభివృద్దే లక్ష్యంగా కృషి చేయాలి

సుభాష్‌నగర్, నవంబరు 7, (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ సంస్థ అభివృద్దే లక్ష్యంగా ప్రతి ఉద్యోగి కృషి చేయాలని నిజామాబాద్ ప్రాంతీయ అధి కారి టి.జ్యోత్స్న అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్ ఎం కార్యాలయ ఆవరణలో శుక్రవారం 2025-26 సంవత్సరానికి త్రైమాసిక ప్రోత్సాహక బ హుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదాయ అభివృద్ధి కేఎంపీఎల్‌లో ప్రతిభకనబర్చిన డ్రైవర్‌లు, కండకర్టర్‌లు, టెక్నీషియన్స్ శ్రామికులకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులను అందజేశారు. క్రమశిక్షణ, సేవాభావం, సురక్షిత ప్రయాణం ఇవే సంస్థ బలాలని ఆర్‌ఎం జ్యోత్స్న అన్నారు. ఈ అవా ర్డులు మీ కృషికి గుర్తింపు మాత్రమేకాదు ఇత రులకు ప్రేరణ కావాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం మధుసూధన్, పీవో పద్మ, డిపో మేనేజర్లు ఆనంద్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



అవగాహన కల్పిస్తున్న మోటివేషన్ స్పీకర్ సంజీవ్

తాడ్వాయి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శ్రద్ధగా చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తాడ్వాయి మోటివేషనల్ స్పీకర్ బండారి సంజీవ్ అన్నారు. ఈయన శుక్రవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే రాజంపేట మండలంలోని గుండారం, కొండాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంపాక్ట్ సంస్థ ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు డ్రగ్స్‌గంజాయి మత్తు పదార్థాలు వంటి చెడు అలవాట్ల బారిన పడకుండా ఉండాలని సూచించారు. మంచి అలవాట్లు అలవాటు చేసుకోవాలి కానీ మత్తు పదార్థాలకు బానిస కాకూడదని,విద్యార్థి దశలో మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఇటు తల్లిదండ్రులకు, అటు సమాజానికి శాశ్వతంగా దూరమవుతారని సూచించారు.మంచి స్నేహితులను ఎంపిక చేసుకోవాలని, తల్లిదండ్రుల పేరు కాపాడాలని, గురువుల ఆజ్ఞలను ఎప్పటికప్పుడు తప్పకుండా పాటించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొత్తం విద్యార్థులు 270 మంది పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే తూకం చేయాలి

బిచ్కుంద,నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సొసైటీ ద్వారా ఏర్పాటైన కొనుగోలు కేంద్రాలలో వరి, సోయా నిబంధనల ప్రకారమే తూకం చేయాలని సొసైటీల పర్యవేక్షణ అధికారి లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌ఆవరణలో రైతులు ఆరాబెట్టిన వరి, సొయా కుప్పలను పరిశీలించి సొసైటీ సిబ్బంది, రైతులతో సమావేశం అయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సొయా తేమ 12 శాతం లోపు వరి ధాన్యం 17శాతం లోపు ఖచ్చితంగా కలిగి ఉంటేనే తూకం వేయాలని సిబ్బందికి సూచించి అందుకు రైతులు కూడా పూర్తి సహకారం అందించాలని తెలియజేశారు. మార్కెట్ యార్డ్ ఆవరణలో రైతులు ఆరాబెట్టిన పంటలు వర్షంలో తడిచిపోకుండా అవసరం ఉన్న రైతులకు టార్పలిన్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉంచాలని సూచించారు. తూకం వేసిన వడ్లను వెంటవెంటనే రైస్ మిల్లులకు తరలించాలని సొయా ను నిర్ధారించిన గోదాంలకు లోడింగ్ అయిన లారీలపై తప్పకుండా టార్పలిన్‌లు డ్రైవర్‌లు కట్టేవిధంగా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఫీల్డ్ అధికారి అలిమోద్దీన్, సొసైటీ కార్యదర్శి శ్రావణి, సిబ్బంది సాయిలు, వేణు రైతులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డిటౌన్,నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రైతులను మోసం చేస్తున్న రైస్‌మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని నాగిరెడ్డిపేట మాజీ జడ్పీటీసీ మోహన్‌రెడ్డి అదనపు కలెక్టర్ విక్టర్‌కు వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని కొనుగోలు కేంద్రాల వద్ద వరిధాన్యం తేమశాతం 16 రాగా రైస్‌మిల్లుల్లో మాత్రం తేమశాతం 19 వస్తుందని రైస్‌మిల్లర్‌లు మాయచేస్తున్నారని తెలిపారు. రైతుల వద్ద లారీకి 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు తరుగుతీస్తున్నారని తెలిపారు. తగు విచారణ జరిపించి రైతులకు న్యాయం చేయాలని అన్నారు. వరి తేమశాతం మిషన్‌లు రైస్‌మిల్లర్లకు ప్రభుత్వమే అందించాలని కోరారు. అలాగే మొక్కజొన్న కేంద్రాలు ప్రారంభం చేసి ఇంతవరకు కాంటా చేయడంలేదని వెంటనే ప్రారంభించాలని తెలిపారు. రైతులకు ఉచితంగాటార్పాలిన్‌లు అందించాలని కోరుతున్నామన్నారు.

ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల అందజేత

దోమకొండ,నవంబరు 7(ఆంధ్రజ్యోతి):దోమకొండ మండలంలోని ముత్యంపేట గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎంపీడీఓ ప్రవీణ్ మంజూరు పత్రాలను అందించారు. మార్కవుట్ చేయించి పనులు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, ఇందిరమ్మ కమిటి సభ్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల ద్వారానే బానిసత్వ విముక్తి

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో మానవాళి ఎదుర్కొంటున్న బానిసత్వ విముక్తి పోరాటాల ద్వారానే సాధ్యమవుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో దుష్టపాలనకు వ్యతిరేకంగా పోరాడి సాధించిన దినోత్సవాన్ని పురస్కరించుకొని లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి సీపీఎం నాయకులతో కలిసి ఆయన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాడు లెనిన్ వర్గపోరాటమే విప్లవం సాధించి దోపిడీ నుంచి విముక్తి పొంది సమాజం పురోగమిస్తుందని తెలియజేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్రాములు, నూర్జహాన్, జిల్లా కమిటీ సభ్యులు సుజాత, నర్సింలు, గంగాధర్, నరేష్, మురళి, రజియాబేగం, యశోద, లక్ష్మి, సురభి తదితరులు పాల్గొన్నారు.

బకాయిల చెల్లింపునకు సహకరించాలి

ఆర్మూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకు తాము చేస్తున్న నిరవధిక బందుకు, కళాశాల యాజమన్యాల సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ శుక్రవారం పెర్కిట్‌లో ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల అసోసియేషన్ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. గత నాలుగేళ్ల నుంచి ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు రాకపోవడంతో తాను కళాశాలలు నడపలేని స్థితిలో ఉన్నామని ప్రైవేట్ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. సమస్య పరిష్కారానికి నిరసన కార్యక్రమం చేపడుతున్నామని మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ తమ పార్టీ ప్రైవేట్ కళాశాలల బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇచ్చిందని తమ సహకారం ఎప్పుడు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ కళాశాలల అసోసియేషన్ ప్రతినిధులు జైపాల్ రెడ్డి, నరాల సుధాకర్, హరిస్మరణ్ రెడ్డి, గురువేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కేజీహెచ్‌లో దోమకొండ మహిళ మృతి

విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని కింగ్ జార్జి హాస్పిటల్ (కేజీహెచ్)లో గురువారం రాత్రి సుమారు 11 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయిన కారణంగా మహిళ మృతి చెందినట్లు ఆమె బంధువులు ఆరోపించారు. తెలంగాణలోని దోమకొండ ప్రాంతానికి చెందిన వి.దేవి విశాఖలోని మర్రిపాలెంలో తన బంధువుల ఇంటికి వచ్చి అస్వస్థతకు గురై ఈ నెల 6న తెల్లవారు జామున సుమారు 3 గంటల సమయానికి కేజీహెచ్‌లో చేరింది. ఆ సమయంలో తీవ్ర జ్వరం, ఒళ్లు నొప్పులు ఉండేవి. వైద్య పరీక్షల అనంతరం ఆమెకు అత్యవసర చికిత్స అందించారు. అనంతరం పరిస్థితి మెరుగుపడటంతో సాధారణ వార్డుకు తరలించారు. ఈ క్రమంలో గురువారం రాత్రి 11 గంటల సమయంలో ఆమె పరిస్థితి విషమించి మృతి చెందింది. ఈ ఘటనపై ఆమె సోదరి మాట్లాడుతూ దేవి మరణానికి ఆక్సిజన్ అందకపోవటం, విద్యుత్ సరఫరా లేక ఉక్కిరిబిక్కిరై మృతి చెందినట్లు ఆరోపించింది. ఆమె ఆరోపణలు సోషల్ మీడియాలో జోరుగా ప్రచారమయ్యాయి. దీనిపై కేజీహెచ్ సూపరింటెండెంట్ ఐ.వాణి వివరణ ఇచ్చారు. ఆ మహిళ ఆసుపత్రిలో చేరాక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఆక్సిజన్, రక్తపోటు నార్మల్‌గా ఉండడంతో సాధారణ వార్డుకు తరలించి వైద్య చికిత్స కొనసాగించామన్నారు. రాత్రి సమయంలో ఆమె ఆరోగ్య పరిస్థితి ఒక్కసారిగా మారిపోవడంతో వైద్య పరీక్షలు నిర్వహించామని, హఠాత్తుగా గుండెపోటు రావటంతో మృతి చెందినట్లు వివరణ ఇచ్చారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- కే రాంప్
ప్రియ 35- దా ఎపిక్
దర్శన్- జటదార

బాన్సువాడ

మహేశ్వరి	మాస్ జాతర
వెంకటేశ్వర	బాహుబలి (ది ఎపిక్)

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.160	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230